క్లుప్తంగా

కుట్టుమెషీన్ల పంపిణీ



కుట్టుశిక్షణ పొందిన మహిళలతో జాన్‌వెస్లీ తదితరులు

సీటీఆర్ఐ: జాన్‌వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ అనంతరం మెషీన్లు పంపిణీ చేశామన్నారు. రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 127 శిబిరాల ద్వారా 26 వేల మందికి వైద్యసేవలు అందించామన్నారు. 55 ఆదర్శ ఎడ్యుకేషన్ సెంటర్ల ద్వారా మురికి వాడల్లోని పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్లెస్సీ వెస్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రామసభలకు ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో గురువారం జరిగే జగనన్న సురక్ష గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నగర పాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 53, 56 సచివాలయాలకు సంబంధించి బెస్తవీధి కమ్యూనిటీ హాల్లో, 54, 55 సచివాలయాలకు మేదరపేట కమ్యూనిటీ హాల్లో, 59, 60, 96 సచివాలయాలకు ఆర్యాపురం ఏబీ నాగేశ్వర రావు రోడ్డు సచివాలయంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వలంటీర్లు గ్రామసభల నిమిత్తం సర్వే నిర్వహించి టోకెన్లు అందజేశారన్నారు. లబ్ధిదారులు సభలకు విచ్చేసి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు.

ప్రతి రైతూ పరిజ్ఞానం పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి జయరామలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో ప్రతి బుధవారం జరిగే పొలంబడిలో రైతులు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి జయరామలక్ష్మి సూచించారు. రాజవోలులోని మార్ని శ్రీనివాస్ క్షేత్రంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జయరామలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకుని సర్టిఫికేషన్ పొందాలన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఏ.భీమరాజు మాట్లాడుతూ సమగ్ర ఎరువుల యాజమాన్యం, అవసరం మేరకు పురుగుమందుల వినియోగం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవాలన్నారు. పొలంబడి వరిగట్లపై వేయడానికి మినీకిట్ ఎల్ఆర్‌జీ-ఎస్2 అనే కందుల రకాన్ని రైతులకు అందజేశారు.

బాధితురాలికి పరామర్శ



ఆసుపత్రిలో శ్రావణిని పరామర్శిస్తున్న బాబు, స్టాలిన్

కడియం: కడియంలో ఉన్మాది దాడిలో గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి ఘటనను తీసుకువెళ్లామన్నారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే శ్రావణిని బుధవారం జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండలానికి చెందిన ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రోలాడ్జిలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడేనికి చెందిన ఆవాల జయరామకృష్ణ (22) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మద్యం ఎక్కువగా తాగుతుండడంతో తండ్రి పైడినాయుడు మందలించాడు. దీంతో జయరామకృష్ణ 10, 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లేవాడు. ఈ ఏడాది మే 18న ఇంటి నుంచి జయరామకృష్ణ బయటకు వచ్చాడు. అప్పటి నుంచి తిరిగి వెళ్లలేదు. కాగా.. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో మెట్రోలాడ్జిలో జయరామకృష్ణ పురుగుమందు తాగి మృతి చెందాడని ఫోన్ రావడంతో పైడి నాయుడు వచ్చారు. అతడి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్.. సేవలు సూపర్..

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ సక్రమంగా అందుతున్నాయంటే దానికి ప్రధాన కారణం వలంటీర్లే. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వీరు పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తుండడంతో లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి కూడా వలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ సొమ్ము తీసుకోవడానికి పెద్ద పోరాటం చేయాల్సి వచ్చేది. పంచాయతీ ఆఫీసువద్దకు ఉదయాన్నే చేరుకుని లైన్‌లో ఉంటే, పింఛన్ సొమ్ము అందేసరికి మధ్యాహ్నం అయ్యేది. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ కష్టాలన్నీ తప్పాయి.

ఆస్పత్రికి వెళ్లి..

ఈమె పేరు షేక్ హసీనా. స్థానిక 31వ డివిజన్ 57వ సచివాలయ పరిధిలోని అన్నపూర్ణమ్మ పేటలో నివాసం ఉంటున్నారు. ఆమె న్యూమోనియాతో బాధపడుతున్నారు. అమలాపురం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాను. ఆమె పింఛన్ తీసుకోవడానికి నగరానికి రాలేకపోయారు. విషయం తెలుసుకున్న వలంటీర్ కోడి అనూష అమలాపురం వెళ్లి హసీనాకు పింఛన్ అందజేశారు. అంతదూరం వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్‌కు హసీనా, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అమలాపురంలో చికిత్స పొందుతున్న హసీనాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కోడి అనూష

సొంతబిడ్డలా..

ఇన్నీసుపేట 38వ సచివాలయ పరిధిలో నివసిస్తున్న బీరా నూకరత్నం బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాత వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె పింఛన్ తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రియాంక లక్ష్మి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించింది. సొంత బిడ్డలే కనీసం చూడడానికి రాని ఈ రోజుల్లో పింఛన్ అందించడానికి ఆసుపత్రికి వచ్చిన వలంటీర్‌ను అక్కడి వారందరూ అభినందించారు.



పక్షవాతంతో బాధపడుతున్న నూకరత్నానికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ ప్రియాంక లక్ష్మి

కృతజ్ఞతలు

నగరంలోని 81వ సచివాలయం పరిధిలోని యళ్ల రామకృష్ణ వేణు అనే మహిళ పక్షవాతంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె పింఛన్ లబ్ధిదారు. కదల్లేని పరిస్థితిల్లో ఉన్న ఆమెకు డబ్బు చాలా అవసరం. కనీస ఖర్చులకు కూడా లేని నిస్సహాయస్థితిలో ఉన్న ఆమెకు వలంటీర్ నాగమణి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. వలంటీర్ సేవలకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.



ఆస్పత్రిలో ఉన్న వేణు అనే మహిళకు పింఛన్ సొమ్ము ఇస్తున్న వలంటీర్ నాగమణి

ఎనలేని సాయం

స్థానిక 45వ డివిజన్‌కు చెందిన ఈమె పేరు గుంపా లక్ష్మి. కాళ్లకి ఆపరేషన్ చేయించుకుని నడవలేని పరిస్థితిలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఆస్పత్రికి వెళ్లి వలంటీర్ రాంప్రసాద్ పింఛన్ డబ్బులు అందజేశాడు. గతంలో పింఛన్ తీసుకోవడానికి వెళ్లలేకపోతే ఆనెల ఇక అందేది కాదు. కానీ ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో ఆస్పత్రిలో ఉన్న లబ్ధిదారులకు సైతం పింఛన్ అందుతోంది.



కాళ్లకు ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రిలో ఉన్న లక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాంప్రసాద్

లక్ష్య సాధనకు సూక్ష్మస్థాయి ప్రణాళిక



సమావేశంలో వివరాలు తెలుసుకుంటున్న జేసీ తేజ్ భరత్



చిన్నారి నాగభూషణంతో ముచ్చటిస్తున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ తరఫున నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సూక్ష్మ స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం సాయంత్రం ఎంపీడీఓ, వీఏవో, వీఏహెచ్‌వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 54 డ్రోన్ కిసాన్ పైలట్ బృందాలకు గాను 40 బృందాలను గుర్తించామని, వారిలో 11 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురిని గుర్తించాల్సి ఉండగా బిక్కవోలు, రాజమండ్రి రూరల్‌లో ఒక్కొక్కరే ఉండడంపై ప్రశ్నించారు. వచ్చే బుధవారానికి పెండింగ్ ఉన్న 14 బృందాలను నియమించి, ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. జిల్లాలో పీఎంకిసాన్ కింద 1,10,126 మందికి గాను 96,279 మందికి ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. 70,905 మంది కౌలు రైతులకు గాను 56,198కి సీసీఆర్‌సీ కార్డుల కోసం జారీ చేశామన్నారు.

పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీపై..

జిల్లాలో గ్రౌండింగ్ అయిన 1,702 పశు యూనిట్ల లబ్ధిదారులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేసేందుకు బ్యాంకర్లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని జేసీ తెలిపారు. జగనన్న పాలవెల్లువ కింద అమూల్ ద్వారా పాల సేకరణ కోసం డీఆర్‌డీఏ, పశుసంవర్ధకశాఖ, అమూల్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో సమావేశం నిర్వహించి అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్య గోవింద్, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు, అమూల్ ప్రతినిధి ధీరజ్ పాల్గొన్నారు.

బంగారుకొండ చక్కని కార్యక్రమం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పౌష్టికాహార లోపం గల పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడానికి బంగారుకొండ పథకం ఒక చక్కటి అవకాశమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. స్థానిక ఇన్నీసుపేట వాకా అప్పలస్వామి వీధిలోని జి.నాగభూషణం ఇంటిని బుధవారం ఆయన సందర్శించారు. బాబు తల్లి పద్మతో మాట్లాడి, బంగారుకొండ కిట్ ద్వారా జరిగిన ప్రయోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతవారం 9.8 కేజీల బరువు ఉన్న నాగభూషణం 200 గ్రాములు పెరిగి 10 కేజీలకు చేరాడని ఆమె తెలిపారు. జేసీ వెంట ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, సూపర్ వైజర్ బి.వరలక్ష్మి ఉన్నారు.

వ్యాయామం కోసమే లోకేష్ పాదయాత్ర



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: యువగళం పాదయాత్రను నారా లోకేష్ ఎందుకు నిర్వహిస్తున్నారో ఎవ్వరికీ తెలియడం లేదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మోరంపూడి ఎఫ్ఓబీ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించడానికి బుధవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర అంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ తిని, పడుకుని చీకటిపడ్డాక తిరగడం కాదన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి పాదయాత్రలు చేస్తారు కానీ అధికార పార్టీపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న లోకేష్ పాదయాత్రపై ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. లోకేష్ ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదన్నారు. లోకేష్‌ను సీఎం అభ్యర్థిగా ఫోకస్ చేయడానికి తండ్రి చంద్రబాబు, దత్తత కుమారుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కానీ దానివల్ల ఎలాంటి ఫలితం ఉండదన్నారు. వ్యాయామం కోసమే లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్టు ఉందన్నారు.

విగ్రహాల ధ్వంసం దారుణం

కడియం: మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, మూడు సింహాల విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమని ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు అన్నారు. స్థానిక బస్టాండు సమీపంలోని ఉన్న ఈ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో కడియం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. మహాత్ముల విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి, స్థానిక నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. దోషులను గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, రైతు నాయకులు చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనారాయణ, గ్రీన్ లాండ్ బాబీ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కంచర్ల చినభద్రరావు, వాచకర్ల గుప్త, నాళం రోశయ్య, వారణాశి శ్రీనివాస గుప్తా, నాళం కిట్టు, గ్రంధి నాగబాబు, నేతి నానాజీ, చక్కా ఆశి, కడించర్ల డాక్టర్ పాల్గొన్నారు.



కడియంలో నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్యులు, గ్రామస్తులు

నర్సరీ పాలకవర్గానికి సవాళ్ల స్వాగతం



నూతన పాలకవర్గ సభ్యులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎన్నిక పూర్తయ్యింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లు పోలరాజు ఎంపికయ్యారు. అలాగే 11 మంది డైరెక్టర్ల పదవులు చేపట్టారు. దేశంలోనే అత్యంత పెద్దదైన నర్సరీ అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నూతన పాలకవర్గానికి పలు సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. సుమారు 15 వేల హెక్టార్లలో కడియం, రాజమహేంద్రవరం రూరల్, కొత్తపేట, ఆలమూరు, మండపేట రూరల్ మండలాల్లో నర్సరీలు విస్తరించాయి. 1836 మంది అసోసియేషన్ సభ్యులున్నారు. రూ. 5 నుంచి రూ.50 లక్షల విలువైన మొక్కలను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. దాదాపు 50 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది. ఇలా పైకి అద్భుతంగా ఉన్నా.. అంతర్గతంగా పలు ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది.

- మొక్కల ఉత్పత్తి దగ్గర నుంచి వాటికి మార్కెటింగ్ చేసుకోవడం వరకూ ప్రతి దశలోనూ నర్సరీ రైతులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉత్పత్తి వ్యయానికంటే తక్కువ ధరకే మొక్కలను అమ్మే పరిస్థితులు కూడా ఉంటున్నాయి. మొక్కల సాగుకు అవసరమయ్యే మట్టి, వెదురుబద్దలు, కూలీలు, ఎరువులు, పురుగు మందులు, ప్లాస్టిక్ కవర్లు.. తదితరాల లభ్యతలో హెచ్చుతగ్గుల కారణంగా రైతులకు పెట్టుబడి వ్యయం విపరీతంగా పెరిగిపోతోంది. సాగుకు ప్రధానమైన ఇటువంటి వస్తువులను అసోసియేషన్ ద్వారా లాభనష్టాల్లేని విధంగా రైతులకు సరఫరా చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో విన్పిస్తోంది. అయితే గత పాలకవర్గాలు ఈ దిశగా ప్రయత్నాలు చేశాయి తప్పితే కార్యాచరణలోకి రాలేదు. ప్రస్తుత పాలకవర్గమైనా నిర్ణీత ధరలకు అందజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.
- మొక్కల సాగులో తెగుళ్ల రైతులకు ప్రతిబంధకంగా తయారయ్యాయి. మొక్కల నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. తమ అనుభవం, పురుగుమందు షాపుల వారు ఇచ్చే సూచనలపైనే ఇప్పుడు రైతులు ఆధారపడుతున్నారు. వేమగిరిలో డివిజనల్ ఫ్లోరీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ద్వారా కొంతవరకు సలహాలు, సూచనలు పొందుతున్నారు. ఇలా పొందే వారి సంఖ్య మొత్తం రైతుల్లో పదిశాతం కూడా ఉండడం లేదు. కేవలం రైతుల అనుభవంపైనే ఆధారపడకుండా ఆధునిక సాగు విధానాలను శాస్త్రవేత్తల ద్వారా అవగాహన పెంపొందించుకునే విధంగా అసోసియేషన్ కృషి చేయాల్సి ఉంది.
- బ్యాంకుల రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, విదేశీ మొక్కల ఎగుమతుల్లో అడ్డంకులు, నర్సరీల చట్టం తదితర సమస్యలను కూడా అధిగమించాల్సి ఉంది. ఈ సమస్యలను వేగంగా పరిష్కరించుకుంటూ, ప్రతియేటా విస్తీర్ణాన్ని పెంచుకుంటున్న కడియం ప్రాంత నర్సరీ రంగం అభివృద్ధిలో కొత్త పాలకవర్గం విశేష కృషి చేయాలన్న ఆకాంక్ష రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

సమస్యల పరిష్కారానికి కృషి

నర్సరీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. వాటి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. ముఖ్యంగా పాలీహౌస్‌లు, షేడ్‌నెట్‌లు తదితర వాటిని పొందేందుకు రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నర్సరీకి ప్రధాన అవసరమైన మట్టి వినియోగం విషయంలో కూడా ఇబ్బందులు ఉన్నాయి. మట్టికి ప్రత్యామ్నాయంగా వినియోగించాల్సిన వాటిపై అధికారులు, రైతుల సమన్వయంతో చర్యలు చేపడతాం.

– మల్లు పోలరాజు, నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

విద్యా దీప్తి.. మహనీయుని స్ఫూర్తి

- అభివృద్ధి పథంలో ఎస్‌కేఆర్
- బాలికల చదువుకు దిక్సూచి



రాజమహేంద్రవరంలోని ఎస్‌కేఆర్ మహిళా కళాశాల

కంబాలచెరువు: మహిళాభ్యున్నతే ధ్యేయంగా రాజమహేంద్రవరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ముందుకు సాగుతోంది. మహిళలపై సమాజం చూస్తున్న చిన్నచూపు తప్పని చెప్పి, వారిని మగవారి కన్నామిన్న అనే విధంగా తయారు చేయాలనే దృఢ సంకల్పంతో 1968లో యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులు దీనిని స్థాపించారు. బాలికల బతుకుల్లో వెలుగులు నింపాలనే ఆశయంతో ఈ విద్యాసంస్థలను నెలకొల్పారు.

కందుకూరి ఆశయాలకు అనుగుణంగా..

ఈ కళాశాల ఎయిడెడ్‌లో నడపబడుతూ, 2022 ఆగస్టులో ప్రభుత్వం ఆధీనంలోనికి వచ్చింది. ప్రభుత్వ ఫీజులతో వీరేశలింగం దంపతుల ఆశయాలకు అనుగుణంగా ఈ కళాశాల నడుస్తోంది. మొదట్లో పదుల సంఖ్యలో ఉండే విద్యార్థినులు నేడు 1,400కు పెరిగారు. అన్ని వసతులతో కూడిన సువిశాల ప్రాంగణం, విశాలమైన తరగతి గదులు, అతిపెద్ద క్రీడామైదానం, విశాలమైన డిజిటల్ లైబ్రరీ, వర్చువల్ తరగతులు, డిజిటల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఇంగ్లిష్ ల్యాబ్, కామర్స్ ల్యాబ్ జిమ్, ఆడిటోరియం, ఆర్‌వో వాటర్ ప్లాంట్, ఎన్‌సీసీ అందుబాటులో ఉన్నాయి.

నూతన భవనాలు

కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, డిగ్రీలో బీఏ, బీఎస్సీలో ఎంపీసీ, బీజెడ్ సీ, బీకాం కోర్సులు అందిస్తున్నారు. అలాగే డిగ్రీలో సింగిల్ మేజర్ కోర్సులు, స్పెషల్ తెలుగు ఆనర్స్, బీకామ్ ఆనర్స్, బీఎస్సీ జువాలజీ ఆనర్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది జగనన్న ఆణిముత్యాల్లో ఇంటర్లో అన్ని గ్రూపుల్లో విద్యార్థినులు టాపర్లుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించడం ద్వారా రూ.రెండు కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో నూతన భవనాలు ఏర్పడ్డాయి.

విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ

కళాశాలలో విద్యార్థినులకు కరిక్యులర్, కోకరిక్యులర్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నాం. పూర్తి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నాం. ప్రఖ్యాత కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారిని చదువులో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాం.

– పి.రాఘవకుమారి, ప్రిన్సిపల్



జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి 9 గంటల వరకూ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ఇంటింటికీ తిరిగి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. నాలుగేళ్లలో ప్రభుత్వం వారికి అందించిన పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ గ్రామాభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, బల్క్‌మిల్క్ కేంద్రం నిర్మించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొలుత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీనగర్‌కు చెందిన ఇసురు దామోదర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని బుధవారం ఏపీ గ్రీనింగ్‌అండ్‌బ్యూటిఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. చందన వెంట వైస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జీసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, మత్సేటి శివ, ఎలుగొండ చెల్లాయమ్మ, సద్గుణ రామారెడ్డి, సోమన శ్రీను, దుర్గ, శ్రీనివాస్ ఉన్నారు.

15న మోటార్ సైకిళ్లకు వేలం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎస్ఈబీ స్టేషన్‌లోని 12 ద్విచక్ర వాహనాలకు ఈనెల 15వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. వివిధ కేసుల్లో నిందితుల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం అనంతరం ఆ రుసుమును తిరిగి చెల్లిస్తామన్నారు.

స్లమ్‌డాగ్ హస్బెండ్ చిత్రబృందం సందడి

రాజానగరం: స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్ర బృందం బుధవారం ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో సంజయ్ (నటుడు బ్రహ్మాజీ కుమారుడు), హీరోయిన్ ప్రణవి, జబర్దస్ ఫేమ్ యాదమ్మ, రాజు విచ్చేశారు. కొద్దిసేపు విద్యార్థినులతో కలిసి సందడి చేశారు. తమ సినిమా ప్రత్యేకతలను వివరించారు. హీరో, హీరోయిన్లు సినిమాలోని పాటలను ప్లే చేసి, విద్యార్థినులతో కలిసి డ్యాన్సులు చేశారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ గల 516ఈ జాతీయ రహదారికి మరమ్మతులు జరుగుతున్నాయి. ఏఈ శ్రీనివాస రావు పర్యవేక్షణలో పనులు చురుకుగా నిర్వహిస్తున్నారు. అయ్యిన గొల్ల కాలువకు ఆనుకొని ఉన్న బెర్మ్ ఇటీవల కిందికి దిగబడింది. కాలువలో వర్షపునీటి ప్రవాహం పెరగడంతో హైఎస్ బ్యాంక్‌మెంట్ కిందికి జారింది. దీనిని ఎత్తుచేయడంతో పాటు జియోగ్రిడ్‌తో పనులు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాతేరులో చోరీలు

కంబాలచెరువు: కాతేరులోని రెండు ఇళ్లలో దొంగలు పడి 39 కాసుల బంగారం, రూ.50 వేలను ఎత్తుకెళ్లిపోయారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి వెంకట మురళీమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి తన ఇంటిలో పడుకున్నాడు. మర్నాడు ఉదయం లేచి చూసేసరికి పక్కగదిలో బీరువా తెరిచి ఉంది. అందులోని 32 కాసుల బంగారం, రూ.45 వేలు మాయమయ్యాయి. అలాగే ఆచంట వెంకట సుబ్బారావు ఇంటిలో అందరూ నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 7 కాసుల బంగారం, రూ.5 వేలు చోరీ చేశారు. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.